ఆదివారం
01-03-2026
పేజీలు: 3

# కలం
ప్రజల గళం...

www.kalamdaily.com
Follow on: Kalamtelugu

360° SINGLE TOPIC

## ఇరాన్.. వార్

**ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల్లో ఇరాన్ 'సుప్రీం' అయాతొల్లా ఖమేనీ మృతి చెందిన వార్త తెలియగానే పశ్చిమాసియాపై ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రమయ్యాయి.**

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా మిస్సైల్స్, డ్రోన్లు ప్రయోగిస్తున్నది. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని టెన్షన్ నెలకొన్నది. అణ్వాయుధాల ఆరోపణలతో తమపై దాడిచేస్తున్న ఇజ్రాయెల్, అమెరికాకు సత్తా ఏంటో చూపిస్తామని ఇరాన్ ఎదురుదాడికి దిగుతున్నది.

**పరస్పర దాడులు, యుద్ధ వాతావరణం ఎటువైపు దారితీస్తుందోనన్న భయం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నది. ఇది అణుయుద్ధం వైపు దారి తీయొచ్చన్న ఆందోళనలూ లేకపోలేదు.**

పొట్టకూటి కోసం ఎడారి దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. దుబాయ్, ఖతార్, అబుదాబీ, కువైట్, ఒమన్, బహ్రెయిన్‌పై ఇరాన్ వరుస దాడులతో వారి బాగోగులపై ఇక్కడి పేరెంట్స్, కుటుంబ సభ్యులు ఆందోళన పడుతున్నారు. అమెరికా స్థావరాలే టార్గెట్‌గా జరుగుతున్న ప్రతీకార దాడులతో చాలా దేశాల్లో హై అలర్ట్ కొనసాగుతున్నది.

ఇరాన్ యుద్ధం.. గల్ఫ్‌లో హైటెన్షన్‌పై
కలం 360 డిగ్రీస్ స్పెషల్...

- తెలంగాణ బ్యూరో, కలం



# గల్ఫ్‌లో హై టెన్షన్

ఇరాన్ యుద్ధంతో తెలంగాణ వలస జీవులు బిక్కుబిక్కు

ఇజ్రాయెల్–యూఎస్ వరుస దాడులు

ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి.. గల్ఫ్ కంట్రీస్‌పై ఇరాన్ అటాక్

దుబాయ్, ఖతర్, సౌదీలోని అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడులు




## ఖమేనీ సహా 210 మంది మృతి

అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చనిపోయారు. ఆయన కుమార్తె, అల్లుడు, మనమరాలు కూడా ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని తన అధికారిక నివాసంలో సీనియర్ అధికారులతో ఖమేనీ శనివారం ఉదయం సమావేశం నిర్వహించనున్నట్టు తెలుసుకున్న అమెరికా, ఇజ్రాయెల్.. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' చేపట్టాయి. తమకు అందిన పక్కా సమాచారం ఆధారంగా అధికారులతో ఖమేనీ భేటీ అయిన బల్డింగ్‌పై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్‌పై శనివారం ఒక్కరోజే 1,200కు పైగా బాంబులు వేశాయి. ఈ దాడుల్లో ఇరాన్ డిఫెన్స్ మినిస్టర్ జనరల్ అజీజ్ నసీర్జాదే, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అబ్దోల్ రహీం మౌసావి, ఐఆర్‌జీసీ కమాండర్ మహమ్మద్ పాక్‌పూర్ సహా దాదాపు 40 మంది సీనియర్ అధికారులు చనిపోయారు. ఇరాన్‌లో మొత్తం 210 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతిలో ఆ దేశ పాలనా పగ్గాలను ముగ్గురు సభ్యుల కౌన్సిల్‌కు అప్పగించారు. ఇరాన్‌లో సుప్రీం లీడర్ తర్వాత గార్డియన్ కౌన్సిల్ పవర్‌ఫుల్. సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అధికారం ఈ కౌన్సిల్‌కు ఉంది.

మరిన్ని కథనాలు 2,3 పేజీల్లో

## గల్ఫ్ దేశాల్లో తెలంగాణ వాసులు 15 లక్షలు





**గల్ఫ్ దేశాల్లో ఇండియన్స్..**

| దేశం | ఇండియన్స్ |
|---|---|
| యూఏఈ | 43 లక్షలు |
| సౌదీ అరేబియా | 27 లక్షలు |
| కువైట్ | 10 లక్షలు |
| ఖతార్ | 8 లక్షలు |
| ఒమన్ | 7 లక్షలు |
| బహ్రెయిన్ | 4 లక్షలు |
| ఇరాక్ | 20 వేలు |
| ఇరాన్ | 10 వేలు |

(ఇవి 2024–25కు సంబంధించిన అంచనా లెక్కలు)

జీవనోపాధి కోసం తెలంగాణ వాసులు గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్‌లో ఎక్కువ మంది ఉన్నారు. ఒమన్, బహ్రెయిన్, ఇరాక్‌లోనూ కొంతమంది పని చేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది ఇండియన్స్ ఉండగా, వీరిలో తెలంగాణ వాళ్లు సుమారు 15 లక్షల మంది ఉంటారని అంచనా. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి లక్షలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో జీవనోపాధి పొందుతున్నారు. వీళ్లు ఎక్కువగా బిల్డింగ్ నిర్మాణ కార్మికులుగా, డ్రైవర్లుగా, క్లీనింగ్ వర్కర్లుగా, డొమెస్టిక్ హెల్పర్లుగా పని చేస్తున్నారు. కొంతమేర నైపుణ్యాలున్న వాళ్లు టెక్నీషియన్స్‌గా, సేల్స్ పర్సన్/స్టోర్ కీపర్, ఇతర పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇక స్కిల్స్ ఉన్నోళ్లు హాస్పిటళ్లలో హెల్త్‌కేర్ సిబ్బందిగా, హోటళ్లలో చెఫ్‌లు, సర్వీస్ బాయ్స్, ఐటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా రాణిస్తున్నారు. గల్ఫ్‌కు వెళ్లే తెలంగాణ వాసుల్లో ఎక్కువ మంది మాత్రం లేబరే.

## ఎక్కడెక్కడ దాడులు..



అమెరికా, ఇజ్రాయెల్ అటాక్‌తో ఇరాన్ ప్రతి దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నది. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్‌పై మిసైల్స్ ప్రయోగిస్తున్నది. దీంతో గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులు, తెలంగాణవాసుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ఎప్పుడు? ఎక్కడి నుంచి బాంబు వచ్చి పడుతుందో తెలియని పరిస్థితిలో అందరూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని ఆయా దేశాల్లోని ఇండియన్ ఎంబసీలు అడ్వైజరీ జారీ చేశాయి.

- ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలన్నీ తమ ఎయిర్‌స్పేస్‌ను బంద్ చేశాయి.
- యూఏఈలోని దుబాయ్‌లో మూడు నాలుగు చోట్ల దాడులు జరిగాయి. అబుదాబి, జెబెల్ అలీ, పామ్ జుమేరా, బూర్జు ఖలీఫా సమీపంలో పేలుళ్లు సంభవించాయి.
- కువైట్‌లోని అలీ అల్ సలేం ఎయిర్‌బేస్, ఖతార్ దోహాలోని అల్ ఉడీడ్ ఎయిర్‌బేస్, బహ్రెయిన్ మానామాలోని యూఎస్ ఎయిర్‌బేస్‌లపై ఇరాన్ దాడులు చేసింది. సౌదీ అరేబియాలోనూ కొన్ని చోట్ల పేలుళ్లు సంభవించాయి.
- ఒక్క ఒమన్ మినహా మిగతా అన్ని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడింది.

### భారత ప్రభుత్వం మౌనం వీడాలి



ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దాడులు అనైతికం. ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా ఒక దేశ సార్వభౌమాధికారంపై దాడి చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. పశ్చిమ దేశాలది ద్వంద్వ నీతి. ఉక్రెయిన్ విషయంలో ఒకలా.. ఇరాన్, పాలస్తీనా అంశాల్లో మరోలా వ్యవహరిస్తున్నాయి. అలా చేస్తే.. మిడిల్ ఈస్ట్‌లో శాంతి పూర్తిగా దెబ్బతింటుంది. అగ్నిగుండగా మారుతుంది. ఇరాన్ విషయంలో భారత ప్రభుత్వం మౌనం వీడాలి. ప్రేక్షకపాత్ర వహించొద్దు. ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించాలి. లేదంటే చమురు ధరలు పెరిగి సామాన్య భారతీయులు ఇబ్బందులు పడతారు.

- అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ చీఫ్



# సద్దాం హుస్సేన్ నుంచి ఖమేనీ వరకు!

**అమెరికా, ఇజ్రాయెల్ జాయింట్ ఆపరేషన్స్‌లో మృతి**

**అణ్వాయుధాలు కలిగి ఉన్నాయన్న ఆరోపణలతో అనేక దేశాలపై అమెరికా యుద్ధానికి దిగుతున్నది. దీనికి ఇజ్రాయెల్ జత కలుస్తున్నది. ఇలా రెండు దేశాలు కలిసి అత్యంత వ్యూహాత్మకంగా దాడులు చేస్తున్నాయి. మిడిల్ ఈస్ట్, వెస్ట్ ఆసియాలోని పలు దేశాలపై మిస్సైల్స్, డ్రోన్లతో విరుచుకుపడటంతో 2006లో సద్దాం హుస్సేన్ మొదలు.. ఇప్పుడు ఖమేనీ వరకు ఆయా దేశాల్లోని కీలక నేతలు చనిపోయారు.**




### అయతొల్లా అలీ ఖమేనీ
**ఇరాన్ సుప్రీం లీడర్**

**మరణం: 2026 మార్చి 1**

**సందర్భం:** ఇరాన్ రాజధాని టెహరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా చేపట్టిన భారీ వైమానిక దాడుల్లో ఆయన మరణించారు.

**వివరాలు:** ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఈ విషయాన్ని ధృవీకరించింది. ఆయన మరణం మిడిల్ ఈస్ట్ పెను మార్పులకు దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



### అహ్మద్ అల్-రహావి
**యెమన్ ప్రధాని-హౌతీ ప్రభుత్వం**

**మరణం: 2025 ఆగస్టు 28**

**సందర్భం:** యెమన్ రాజధాని సనాలోని ఓ నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది.

**వివరాలు:** హౌతీ రెబల్స్ గ్రూప్‌కు చెందిన రాజకీయ విభాగంలో ఈయన కీలక నేత. ఇజ్రాయెల్ తన ఆపరేషన్‌లో భాగంగా ఇరాన్ మద్దతు ఉన్న గ్రూపుల నాయకులను ఏరివేసే క్రమంలో ఈ దాడి జరిగింది.



### ఇస్సాం అల్-దాలిస్
**గాజా స్ట్రిప్ హమాస్ ప్రభుత్వ అధిపతి**

**మరణం: 2025 మార్చి**

**సందర్భం:** గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న యుద్ధంలో భాగంగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు జరిపిన బాంబుల దాడిలో ఈయన మరణించారు.

**వివరాలు:** హమాస్ రాజకీయ, పరిపాలనా వ్యవహారాల్లో ఈయన రెండో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఉండేవారు. ఈయనతో పాటు 300 మందికి పైగా చనిపోయారు.




### హసన్ నస్రల్లా
**హెజ్బొల్లా సెక్రటరీ జనరల్**

**మరణం: 2024 సెప్టెంబర్ 27**

**సందర్భం:** లెబనాన్ రాజధాని బీరూట్‌లోని దహియే ప్రాంతంలో ఉన్న హెజ్బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది.

**వివరాలు:** సుమారు 32 ఏళ్ల పాటు హెజ్బొల్లాను నడిపించిన నస్రల్లా, బంకర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరిగింది.



### ఖాసీం సులేమానీ
**ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ కమాండర్**

**మరణం: 2020 జనవరి 3**

**సందర్భం:** ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపల అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో మరణించారు.

**వివరాలు:** అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఈ దాడికి ఆదేశాలు ఇచ్చారు.

### గడాఫీ, లిబియా మాజీ పాలకుడు

**మరణం: అక్టోబర్ 20, 2011.**

**సందర్భం:** లిబియాలో అరబ్ స్ప్రింగ్ విప్లవం సమయంలో తిరుగుబాటుదారుల చేతికి చిక్కి హత్యకు గురయ్యారు.

**వివరాలు:** గడాఫీ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన కాన్వాయ్‌ను అమెరికా నేతృత్వంలోని నాటో విమానాలు బాంబులతో అడ్డుకున్నాయి. ఆ తర్వాత తిరుగుబాటుదారులు ఆయనను పట్టుకుని హింసించి కాల్చి చంపారు.






### సద్దాం హుస్సేన్, ఇరాక్ మాజీ అధ్యక్షుడు

**మరణం: 2006 డిసెంబర్ 30 (ఉరిశిక్ష)**

**సందర్భం:** 2003లో అమెరికా ఇరాక్‌పై దాడి చేసి సద్దాం పాలనను అంతం చేసింది. ఆ తర్వాత ఆయనను పట్టుకుని ఇరాక్ కోర్టులో విచారించారు.

**వివరాలు:** 1982లో దుజైల్ గ్రామంలో 148 మంది షియాలను చంపించిన నేరానికి (మానవత్వానికి వ్యతిరేక నేరాలు) గాను ఇరాక్ ప్రత్యేక కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. ఇరాక్ అధికారులే ఆయనను ఉరితీశారు.



## బుష్ హయాంలో మారణహోమం

అమెరికా అధ్యక్షుడిగా జార్జ్ బుష్ ఉన్న టైమ్‌లో ప్రారంభమైన యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కేవలం ఇరాక్, ఆఫ్గనిస్తాన్‌లోనే బుష్ తన పదవీకాలం ముగిసే సమయానికి సుమారు 2 లక్షల మందికి పైగా (సైనికులు, పౌరులు కలిపి) మరణించారని అంతర్జాతీయ సంస్థల గణాంకాలు చెబుతున్నాయి.

**ఆఫ్గనిస్తాన్ (2001 నుంచి 2009):** 2001 సెప్టెంబర్ 11న అమెరికాపై జరిగిన ఉగ్రదాడులకు మాస్టర్ మైండ్ లాడెన్‌ను పట్టుకోవడానికి, అతనికి ఆశ్రయం ఇచ్చిన తాలిబన్ ప్రభుత్వాన్ని కూల్చడానికి దాడులు చేసింది. ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్ పేరుతో భారీ ఎత్తున వైమానిక దాడులు, భూతల దళాలను రంగంలోకి దించారు. బుష్ హయాంలో ఇక్కడ దాదాపు 15 వేల మంది చనిపోయారు.

**ఇరాక్ (2003 నుంచి 2009):** ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయని, అవి ప్రపంచానికి ముప్పని అమెరికా ఆరోపించింది. షాక్ అండ్ ఏవ్ పద్ధతిలో బాగ్దాద్ నగరంపై నిరంతర బాంబుల వర్షం కురిపించారు. ఇది అత్యంత రక్తపాతంతో కూడిన యుద్ధం. బుష్ హయాం ముగిసేనాటికి ఇక్కడ సుమారు లక్షన్నర మంది పౌరులు చనిపోయారు. సద్దాం హుస్సేన్ పట్టుబడటం, అనంతరం ఉరితీయడం ఈ కాలంలోనే జరిగింది.

**పాకిస్తాన్ (2004 నుంచి 2009):** ఆఫ్గనిస్తాన్ సరిహద్దుల్లోని గిరిజన ప్రాంతాల్లో తలదాచుకున్న అల్-ఖైదా నాయకులను ఏరివేయడానికి డ్రోన్ దాడులు చేశారు. బుష్ హయాంలోనే అమెరికా మొదటిసారిగా డ్రోన్లను ఒక యుద్ధ ఆయుధంగా వాడటం ప్రారంభించింది. సుమారు 50కి పైగా డ్రోన్ దాడులు జరిగాయి. వీటిలో 600 మంది వరకు చనిపోయారు.

**యెమన్ (2002 నుంచి 2009):** అక్కడ విస్తరిస్తున్న అల్-ఖైదా నెట్‌వర్క్ దెబ్బతీయడానికి దాడులు చేశారు. 2002లో మొదటిసారిగా యెమన్‌లో అమెరికా తన ప్రిడేటర్ డ్రోన్‌తో దాడి చేసి అల్-ఖైదా నాయకుడిని హతమార్చింది. ఇక్కడ దాడుల సంఖ్య పరిమితంగా ఉన్నప్పటికీ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో యెమన్‌ను ఒక కీలక కేంద్రంగా బుష్ మార్చారు.

**సోమాలియా (2007 నుంచి 2009):** ఇస్లామిక్ కోర్ట్స్ యూనియన్, అల్-షబాబ్ ఉగ్రవాదులు అల్-ఖైదాతో సంబంధాలు కలిగి ఉన్నారనే అనుమానంతో వైమానిక, నౌకా దళాల నుంచి క్షిపణి దాడులు నిర్వహించారు. వందలాది మంది తీవ్రవాదులు చనిపోగా, పౌర మరణాలపై స్పష్టమైన లెక్కలు అందుబాటులో లేవు.



బరాక్ ఒబామా 2009 నుంచి 2017 వరకు అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ కాలంలో ఆయన ఏడు దేశాలపై వైమానిక, డ్రోన్ దాడులకు ఆదేశాలిచ్చారు. ఒబామా తన ముందున్న అధ్యక్షుడు బుష్ కంటే దాదాపు 10 రెట్లు ఎక్కువ డ్రోన్ దాడులను నిర్వహించారు. ఈ దాడుల వల్ల ఉగ్రవాదులతో పాటు వందలాది మంది అమాయక పౌరులు కూడా మరణించారని అంతర్జాతీయ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ఒబామా హయాంలోనే (2011లో) పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో అల్-ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్ను అమెరికా దళాలు హతమార్చాయి. ఒబామా హయాంలో జరిగిన 542 డ్రోన్ దాడులలో సుమారు 3,797 మంది చనిపోయినట్లు అంచనా. ఇందులో సుమారు 450 మంది వరకు అమాయక పౌరులు ఉన్నారు.

## ఒబామా హయాంలో 7 దేశాలపై..

**పాకిస్తాన్:** 2009, 2016లో పాకిస్తాన్‌పై ఒబామా దాడులు చేశారు. అల్-ఖైదా, తాలిబన్ నాయకులు పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలలో దాక్కున్నారని అమెరికా భావించింది. డ్రోన్లతో దాడులు నిర్వహించింది. ఒబామా బాధ్యతలు చేపట్టిన మొదటి సంవత్సరంలోనే బుష్ కాలం కంటే ఎక్కువ డ్రోన్ దాడులు జరిగాయి. దాదాపు 400 పైగా డ్రోన్ దాడులు జరిగాయి.

**ఆఫ్గనిస్తాన్:** 2009, 2017 ఆఫ్గనిస్తాన్‌పై ఒబామా దాడులు చేశారు. బుష్ కాలం నుంచి కొనసాగుతున్న యుద్ధాన్ని ఒబామా మరింత ఉధృతం చేశారు. 2009లో అదనంగా 30,000 మంది సైనికులను పంపి, తాలిబన్ స్థావరాలపై నిరంతర వైమానిక దాడులు చేయించారు. 2017లో ఆయన పదవి నుంచి దిగిపోయే వరకు ఇక్కడ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

**యెమన్:** 2009, 2017లో యెమన్‌పై ఒబామా దాడులు చేశారు. అల్-ఖైదా ఇన్ ది అరేబియన్ పెనిన్సులా ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని 2009 నుంచి వరుసగా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో తీవ్రవాదులతో పాటు పెండ్లి బృందాల్లో పౌరులు, ప్రజలు పొరపాటున చనిపోవడం పెద్ద వివాదానికి దారితీసింది.

**సోమాలియా:** 2009, 2017లో సోమాలియాపై దాడులు జరిగాయి. ఆఫ్రికా దేశమైన సోమాలియాలో అల్-షబాబ్ ఉగ్రవాదులను అణచివేయడానికి 2009 నుంచి పరిమిత సంఖ్యలో డ్రోన్ దాడులు, ప్రత్యేక దళాల దాడులు నిర్వహించారు.

**లిబియా:** 2011లో లిబియాపై ఒబామా దాడులు చేశారు. లిబియాలో అంతర్యుద్ధం తలెత్తినప్పుడు, అమ్మర్ గడ్డాఫీ సైన్యంపై అమెరికా, నాటో దేశాలు కలిసి భారీ వైమానిక దాడులు చేశాయి. ఈ దాడుల వల్ల గడ్డాఫీ పతనం సంభవించింది.

**సిరియా:** 2014, 2017లో సిరియాపై దాడులు చేశారు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థను అంతం చేయడానికి 2014 సెప్టెంబర్ నుంచి సిరియాలో అమెరికా వైమానిక దాడులు ప్రారంభించింది. ఒబామా పదవీకాలం ముగిసే వరకు ఇక్కడ వేల సంఖ్యలో బాంబు దాడులు జరిగాయి.

**ఇరాక్:** 2009 నుంచి 2011 తిరిగి 2014 నుంచి 2017 వరకు ఒబామా ప్రభుత్వం ఇరాక్‌పై దాడులు చేసింది. మొదట 2011లో ఇరాక్ నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించారు. కానీ, 2014లో ఐసిస్ ఉగ్రవాదులు విజృంభించడంతో, వారిని అడ్డుకోవడానికి మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించి, 2017 వరకు కొనసాగించారు.

## శాంతి అంటూనే.. ట్రంప్ దాడులు

ట్రంప్ తన విదేశీ విధానంలో అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ఉన్నప్పటికీ.. శాంతి అంటూనే అమెరికా ప్రయోజనాల కోసం పలు దేశాలపై దాడులకు ఆదేశాలిచ్చారు. ట్రంప్ మొదటి విడత పాలనలో (2017-2021) జరిగిన దాడుల్లో సుమారు 15,000 మంది వరకు మరణించినట్లు వివిధ స్వచ్ఛంద సంస్థల అంచనా. ఇందులో ఉగ్రవాదులతో పాటు పౌరులు కూడా ఉన్నారు. ముఖ్యంగా సిరియా, ఇరాక్, యెమన్ దేశాల్లో మౌలిక సదుపాయాలు భారీగా ధ్వంసమయ్యాయి.

**ఆఫ్గనిస్తాన్ (2017, 2021):** తాలిబన్, ఐసిస్-కే ఉగ్రవాదులను ఏరివేయడానికి ట్రంప్ ఇక్కడ దాడులను ఉధృతం చేశారు. 2017 ఏప్రిల్‌లో అమెరికా తన అత్యంత శక్తివంతమైన అణుయేతర బాంబు 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'ను ఇక్కడి ఉగ్రవాద సొరంగాలపై ప్రయోగించింది.

**పాకిస్తాన్ (2017, 2025):** ఉగ్రవాదులకు పాకిస్థాన్ సురక్షిత స్థావరంగా ఉందనే ఆరోపణతో డ్రోన్ దాడులు జరిపారు. అయితే, పాకిస్తాన్‌కు ఇచ్చే సైనిక సహాయాన్ని నిలిపివేస్తూనే, ఒబామా కాలం నాటి కంటే తక్కువ సంఖ్యలో ఇక్కడ డ్రోన్ దాడులు నిర్వహించారు.

**సిరియా (2017, 2025):** సిరియా ప్రభుత్వం తన సొంత ప్రజలపై రసాయన ఆయుధాలు ప్రయోగించినందుకు శిక్షగా 2017లో దాడులు చేశారు. 2025లో ఐసిస్ పునరుద్ధరణను అడ్డుకోవడానికి మళ్లీ దాడులు జరిగాయి. 2017లో 59 క్షిపణులతో సిరియా ఎయిర్‌బేస్‌ను అమెరికా ధ్వంసం చేసింది.


**ఇరాక్ (2017, 2025):** ఐసిస్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టడానికి, ఇరాన్‌లో ఉన్న అమెరికా దళాలపై దాడులు చేస్తున్న గ్రూపులను లక్ష్యంగా చేసుకున్నారు. 2025లో ఇరాక్‌లో పెరుగుతున్న ఇరాన్ ప్రాబల్యాన్ని తగ్గించడానికి పదే పదే వైమానిక దాడులు నిర్వహించారు.

**లిబియా (2019):** లిబియాలో స్థావరాలు ఏర్పరచుకున్న ఐసిస్ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. 2019 సెప్టెంబర్‌లో జరిగిన వరుస వైమానిక దాడుల్లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారు.

**నైజీరియా (2025):** ఆఫ్రికాలో పెరుగుతున్న ఉగ్రవాద ముప్పును అడ్డుకోవడానికి అమెరికా దళాలు ఇక్కడ జోక్యం చేసుకున్నాయి.

**ఇరాన్ (2025, 2026):** ఇరాన్ అణు కార్యక్రమం, ఆ దేశం మిడిల్ ఈస్ట్ సృష్టిస్తున్న అశాంతికి అడ్డుకట్ట వేయడానికి దాడి చేశారు. తాజాగా జరిగిన ఈ భారీ దాడుల్లోనే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ చనిపోయారు.

**వెనెజువెలా (2025, 2026):** వెనెజువెలాలోని రాజకీయ అస్థిరత, అమెరికా వ్యతిరేక చర్యల నేపథ్యంలో సైనిక చర్యలు చేపట్టారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో అతని భార్యను అదుపులోకి తీసుకున్నారు.



కలం
01-03-2026, ఆదివారం



# యుద్ధనీడలో హార్మూజ్

## మూసేస్తామని ఇరాన్ వార్నింగ్..

## మన 50% ఆయిల్ ట్రాన్స్‌పోర్ట్ ఈ మార్గం గుండానే..

అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై జరిపిన తాజా మెరుపు దాడులు పశ్చిమాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది ఒక సవాలుగా మారింది. ఇజ్రాయెల్–అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. భారత్ తన ముడి చమురు దిగుమతుల్లో సగానికి పైగా ఈ మార్గం నుంచే  చేసుకుంటుంది.  ఖమేనీ మృతి వార్త బయటకు రాగానే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఇప్పటికే బ్యారెల్‌కు 73 డాలర్ మార్క్ దాటింది. ఒకవేళ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే, ధరలు 100 డాలర్లకు చేరే అవకాశం ఉంది.

### రోజుకు 26 లక్షల బ్యారెల్స్

ఇరాన్‌ను ఒమన్, యూఏఈల నుంచి వేరు చేసే జలసంధి హార్మూజ్. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం ఆయిల్ రవాణా ఈ మార్గం నుంచే సాగుతుంది. 2025 చివరి నాటికి 40 శాతంగా ఉన్న భారత చమురు దిగుమతులు, 2026 జనవరి-ఫిబ్రవరి నాటికి 50 శాతానికి పెరిగాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యన్ చమురు కొనుగోళ్లను తగ్గించి, మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడటం పెరగడం దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల ముడి చమురును ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి హార్మోజ్ మార్గం మీదుగా దిగుమతి చేసుకుంటున్నది. సగటున రోజుకు 74 వేల బ్యారెళ్ల శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులనూ భారత్ ఈ జలసంధి నుంచే ఎగుమతి చేస్తోంది.



### ప్రపంచ చమురు రవాణాకు 'జీవనధార'

ప్రపంచ చమురు రవాణాకు హార్మూజ్ జలసంధి ఒక జీవనధార. దీన్ని మూసివేస్తామని ఇరాన్ తరచూ హెచ్చరిస్తున్నది. ఇది మూతపడితే ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ సరఫరా ఆగిపోయి, ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ మార్గానికి సమానమైన ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతోంది. ఇక్కడ రవాణాకు ఏమాత్రం ఆటంకం ఏర్పడినా ఇంధన, సరుకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెనుభారం మోపడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఇంధన భద్రతకు గల్ఫ్ వెన్నెముక

భారత్, గల్ఫ్ దేశాలకు మధ్య ఉన్న సంబంధం కేవలం వ్యాపారం మాత్రమే కాదు.. అది మన దేశ ఇంధన భద్రతకు వెన్నెముక లాంటిది. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 85% దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో గల్ఫ్ దేశాల పాత్ర అతి పెద్దది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈలు భారత్‌కు టాప్-5 చమురు సరఫరాదారుల్లో ఉన్నాయి. ఫిబ్రవరి 2026 నాటికి రష్యాను వెనక్కి నెట్టి భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా సౌదీ అరేబియా అవతరించింది. సౌదీ నుంచి భారత్ రోజుకు సుమారు 11.30 లక్షల బ్యారెల్స్ దిగుమతి చేసుకుంటోంది. సాధారణంగా భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురులో 55% నుంచి 60% వరకు కేవలం గల్ఫ్ దేశాల నుంచే వస్తుంది.

### ఒక డాలర్ పెరిగితే.. రూ.16 వేల కోట్ల భారం

చమురు ధర ఒక డాలర్ పెరిగితే .. మనం దిగుమతి చేసుకుంటున్న క్రూడాయిల్‌పై ఏడాదికి రూ.16 వేల కోట్ల అదనపు భారం పడుతుంది. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. డాలర్ల కోసం డిమాండ్ పెరగడం వల్ల రూపాయి విలువ పడిపోయే ప్రమాదం ఉంది. దిగుమతి బిల్లు పెరిగితే దేశ ఆర్థిక లోటు పెరుగుతుంది.




### ట్రిపుల్ రిస్క్‌లో ఇండియా!

ట్రంప్ ఒత్తిడి కారణంగా ఫిబ్రవరి 2026 నాటికి రష్యా నుంచి ఇండియాకు వచ్చే చమురు రోజుకు 11 లక్షల బ్యారెల్స్‌కు పడిపోయింది. గతంలో ఇది 20 లక్షల బ్యారెల్స్. మార్చి 2026 నాటికి 8 లక్షల బ్యారెల్స్‌కు పరిమితం కావొచ్చని అంచనా. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా అక్కడ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి.  ప్రస్తుతం వెనెజువెలాపై అమెరికా ఆంక్షలను సడలించింది. దీని వెనుక ప్రధాన ఉద్దేశం భారత్, చైనా వంటి దేశాలు రష్యాపై ఆధారపడకుండా చూడటం. అమెరికా ప్రభుత్వం వెనెజువెలా చమురును విక్రయించడానికి, రవాణా చేయడానికి లిమిటెడ్ లైసెన్స్ ఇచ్చింది. రిలయన్స్, ఇండియన్ ఆయిల్ వంటి సంస్థలు ఇప్పటికే వెనెజువెలా నుంచి మార్చి, 2026 లోడింగ్ కోసం భారీ నౌకలను బుక్ చేసుకున్నాయి. వెనెజువెలా చమురు ధర తక్కువగా ఉన్నా, అది చాలా చిక్కగా ఉంటుంది. మన వద్ద ఉన్న అన్ని రిఫైనరీలు దీనిని ప్రాసెస్ చేయలేవు. పైగా రష్యా కంటే వెనెజువెలా నుంచి చమురు రావడానికి టైమ్, ఖర్చు ఎక్కువ. భారత్ ప్రస్తుతం ఒక 'ట్రిపుల్ రిస్క్' లో ఉంది. రష్యా నుంచి తీసుకోవడంపై అమెరికా ఆంక్షల భయం మొదటిది. యుద్ధం, హార్మూజ్ మూసివేత రెండోది. వెనెజువెలా ప్రత్యామ్నాయమైనా.. ఇది రష్యా ఇచ్చే భారీ డిస్కౌంట్లను భర్తీ చేయలేదనేది మూడో రిస్క్.

### ఆయిల్ షిప్‌పై దాడి

హార్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న ఒక భారీ ఆయిల్ షిప్ లక్ష్యంగా ఆదివారం ఇరాన్ దళాలు దాడికి పాల్పడ్డాయి. ఈ నౌకలో 15 మంది భారతీయులు, ఐదుగురు ఇరాన్ దేశస్తులు ఉన్నారు. ఒమన్ తీరంలోని ముసందమ్ ద్వీపకల్పానికి సమీపంలో ఈ ఘటన జరిగింది. 'స్కైలైట్' పేరుతో ఉన్న ఈ చమురు నౌకపై పలావు దేశపు జెండా ఉంది. ఈ దాడిలో నలుగురు గాయపడ్డారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది. దాడి అనంతరం నౌకలోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించారు.



### బంగారం, వెండి ధరలకు రెక్కలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో శనివారం నుంచి బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి 27న రూ. లక్షా 61 వేలు ఉన్న తులం బంగారం (24 క్యారెట్స్) ధర.. 28న లక్షా 69 వేలకు చేరుకుంది. ఆదివారం ఏకంగా అది లక్షా 74 వేలకు చేరుకుంది. అదే సిల్వర్ కిలో ఫిబ్రవరి 27న రూ. 2 లక్షల 95 వేలు ఉండగా.. మరుసటి రోజు 25వేలు పెరిగి రూ. 3 లక్షల 20వేలు అయింది. ఆదివారం మరో ఐదు వేలు పెరిగి.. రూ. 3 లక్షల 25 వేలకు చేరుకుంది. ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే.. మరింత రేట్లు పెరగొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



### పాకిస్తాన్‌లో రెడ్ అలర్ట్

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో పాకిస్తాన్‌లో ఆందోళనలు చెలరేగాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్‌పై కొందరు దాడికి ప్రయత్నించారు. ఈ ఘర్షణల్లో 9 మంది మృతి చెందారు. ఇరాన్, పాకిస్తాన్ బార్డర్‌లో తీవ్ర ఉద్రికత్తలు పెరిగాయి. రెండు దేశాల మధ్య దాదాపు 909 కిలో మీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. షియా, సున్నీ వర్గాల మధ్య విభేదాలు ముదిరే చాన్స్ ఉందనే భయంతో పాకిస్తాన్ వ్యాప్తంగా రెడ్ అలర్ట్ విధించారు. ఇరాన్‌లో ఉంటున్న తమ పౌరులు అనవసర ప్రయాణాలు చేయొద్దని పాకిస్తాన్ రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. దేశవ్యాప్తంగా గిల్గిత్-బాల్టిస్తాన్ వంటి ప్రాంతాల్లో అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలతో భారీ ర్యాలీలు జరుగుతున్నాయి.

### లక్నో, హైదరాబాద్‌లో నిరసనలు

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో భారత్‌లోని లక్నో, హైదరాబాద్ ఓల్డ్ సిటీలో నిరసనలు జరిగాయి. ఖమేనీ మరణాన్ని లక్నోలోని షియా, సున్నీ మత పెద్దలు 'శతాబ్దపు అతిపెద్ద విషాదం'గా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మూడు రోజుల సంతాప దినాలను ప్రకటిస్తున్నట్టు ఆల్ ఇండియా షియా పర్సనల్ లా బోర్డ్ తెలిపింది. నల్లజెండాలు ఎగురవేయాలని, నల్లని దుస్తులు ధరించాలని పిలుపునిచ్చింది. ఓల్డ్ లక్నోలో భారీగా భద్రతను మోహరించారు.

**హైదరాబాద్ ఓల్డ్ సిటీలో..**

హైదరాబాద్ ఓల్డ్ సిటీలో నిరసనకారులు అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ తీశారు. 'తంజీమ్-ఏ-జాఫరీ' ఆధ్వర్యంలో పురానీ హవేలీలోని మజార్-ఏ-ఇబ్ నే ఖాతూన్ నుంచి భారీ నిరసన ర్యాలీ తీశారు. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు  స్వచ్ఛందంగా షాపులను మూసివేసి నిరసన తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన దాదాపు 44 ఫ్లైట్లు రద్దయ్యాయి.



లక్నోలో..